

తిరుపతిలో గోమాతకు పూజలు

ప్రజాశక్తి- తిరుపతిసిటీ

వాలెంటైన్స్ వద్దు గోమాత ముద్దు అన్నారు. టీటీడీ పాలక మండలిసభ్యులు మొరంశెట్టి రాములు కేంద్రప్రభుత్వ పిలుపు మేరకు గోవు అలింగన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14న గోవు ఆలింగన దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. తిరుపతిలోని పాఠశాలలో గోఆలింగన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు మొరంశెట్టి రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి గోమాతకు పూజలు నిర్వహించి దానా పెట్టి గోవును ఆలింగనం చేసుకొన్నారు. వారు మాట్లాడుతూ ప్రేమికుల రోజు జరుపుకోవడం మన సంస్కృతి కాదని చెప్పారు. వాలెంటైన్స్ వద్దు గోమాత ముద్దు అన్న నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందని, అందులో భాగంగానే నేడు గోఅలింగన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

నగరిలో పరిస్థితి ఉద్రిక్తత

- టిడిపి, వైసీపీల మధ్య ఘర్షణ
- 38 మందిపై కేసులు
- స్వల్ప లాఠీఛార్జి



మంత్రి రోజా ఇంటిలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న టిడిపి మహిళా నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం పుత్తూరులో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ మంత్రి రోజాపై నగరి నియోజకవర్గంలోని భూములను కబ్జా చేసి అమ్ముకుంటుందని, ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం, లిక్కర్ అక్రమంగా అమ్ముకుంటున్నారని, రోజా కుటుంబసభ్యులు పెత్తనం చలాయిస్తూ నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దారుల ద్వారా లంచం తీసుకొని వాటా పంచుకుంటున్నారని ఆరోపించారు. లోకేష్ ఆరోపణపై మంత్రి రోజా మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులు తన రాజకీయ ఎదుగుదలకు అండదండగా ఉండారే తప్ప రాజకీయాల్లో వారి జోక్యం లేదని తన కుటుంబ సభ్యుల మీద అసత్య ఆరోపణలు చేసిన లోకేష్‌ని చెంప మీద కొడతానని, దమ్ము, ధైర్యం ఉంటే తన ఇంటికి రావాలని సవాల్ విసిరారు. లోకేష్ మీద సవాల్ విసిరిన నేపథ్యంలో నగరి మాజీ ఎంపీపీ, రాష్ట్ర తెలుగు అధికార ప్రతినిధి మీరా పార్లమెంటు అధ్యక్షురాలు అరుణ ఆధ్వర్యంలో దాదాపు పది మంది మహిళలు నగరి పోలీసులను పక్కదారి పట్టించి మంత్రి రోజు ఇంటిలోకి చొరబడ్డారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి నగరి పోలీస్‌స్టేషన్ తరలించారు. తమ మహిళా నాయకురాళ్లను అరెస్ట్ చేసారాన్న తెలుసుకున్న టీడీపీ శ్రేణులు, నాయకులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్లోకి వచ్చి తమ పార్టీ వాళ్ళను చూపించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో 38 మంది టిడిపి నాయకులపై కేసు నమోదు చేయడంతోపాటు 11 మంది అదుపులోకి తీసుకున్నారు. ఇంతలోనే మంత్రి రోజా ఇంటిలోకి టిడిపి మహిళా నాయకులు వచ్చారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, కార్యకర్తలు దాదాపు 1000మంది పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులతో ఘర్షణ పడ్డారు. నగరి ఇన్స్పెక్టర్ శ్రీనివాసంతి జోక్యం చేసుకుని ఇరు వర్గాల మధ్య చర్చలు జరిపి పోలీస్‌స్టేషన్ నుంచి పంపించేశారు. అయితే పోలీస్ నుంచి బయటవెళ్లాక టిడిపి, వైసీపీ శ్రేణులు నినాదాలు ప్రతినిధులు చేసుకుంటూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. వివాదం ముదరడంతో నింద్ర, విజయపురం మండలాలకు సంబంధించిన ఎస్సైలు, సీఐలతోపాటు స్పెషల్ పార్టీని రంగంలోకి దించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పట్టణంలో అధికార, ప్రతిపక్షపార్టీ నాయకుల ఘర్షణతో భయానక వాతావరణం మధ్య ఏంజరుగుతుందో తెలియక స్థానికులు అయోమయానికి గురయ్యారు.

యువగళానికి బ్రహ్మరథం


- నాగలాపురంలో ఇసుక దోపిడీ అరికట్టాలి
- బహిరంగసభలో నారా లోకేష్



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి- పిచ్చాటూరు (తిరుపతి జిల్లా):

వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ.. ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ అడుగడుగునా నీరాజనాలు అందుకుంటూ.. సమస్యలు పరిష్కరం లక్ష్యంగా హామీలు ఇస్తూ.. ఆప్యాయత పలికరింపుతో ముందుకు సాగుతోంది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర. మంగళవారం నారాయనవనం మండలం నుంచి పిచ్చాటూరు మండలంలోని ప్రవేశించిన నారా లోకేష్‌కు సత్యవేడు టీడీపీ ఇంచార్జి హెలెన్, నాయకులు గజమాలాలతో స్వాగతం పలికారు. ప్రజలు నారా లోకేష్ మా అబ్బాయి పాదయాత్రతో రాటు తేలేడు అంటూ మహిళలు హారతులు పడుతూ బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో పసుపు దళం నూతనోత్సాహంతో పాదయాత్రలో ముందుకు కొనసాగుతున్నారు. సాయంత్రం 4 గంటలకు కీలపూడిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో నారా లోకేష్ ప్రసంగించారు. సమస్యలన్నీ పరిష్కారమై అభివద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు. టీడీపీ కంచుకోటగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో ఓటమి ఎదుర్కొన్నామని, ఈ ఎన్నికల్లో టిడిపి నాయకులు ఏకతాటిపైకి నిలిచి టిడిపి విజయనికి కషిచేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ కంచుకోట చెక్కుచెదరలేదని నిరూపించాలని టీడీపీ శ్రేణులుకు పిలుపునిచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా ప్రకతి వనరులు దోచుకున్నారంటూ మండిపడ్డారు. వీరప్పన్ తరహాలో ఎక్కడైనా.. ఏమైనా.. దోచుకు దాచుకో.. అన్న సిద్ధాంతంతో సైకో ప్రభుత్వం వ్యహరిస్తున్నదని అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి 18 నెలలుగా ఇసుకదోపిడీ చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక ట్రిప్పర్ రూ.10వేలకు దొరికితే నేడు వైసిపి ప్రభుత్వం హయాంలో లక్ష రూపాయల విక్రయిస్తున్నారు. సామాన్యుడు ఇసుక కొనే పరిస్థితి లేదన్నారు. నాగలాపురం మండలం సురుటిపల్లి నదనం బయట కోడియం బెడు వద్ద అక్రమ ఇసుక రవాణా చేస్తూ కోట్లు దోచుకుంటున్నారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే ఇసుక గ్రావెల్ దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. జగన్‌ది అధికార బలం అయితే.. మనది యువగళం అని వ్యాఖ్యానించారు. నాడు ఎన్నికల సమయంలో జగన్ రెడ్డి మద్యం నిషేధం దశవారీగా అమలు చేసి అక్కచెల్లెమ్మలు వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెపాపరని, అయితే నేడు ప్రభుత్వం దశలవారీగా మద్యం దుకాణాలు పెంచుకుంటూ పోతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో నాలుగు చెరకు ప్యాక్టరీలు చెరుకు క్రాసింగ్ చేసేవని, నేడు ప్యాక్టరీలు మూతపడేలా చేసి రైతులకు బకాయిలు చెల్లించకుండా తిప్పించుకుంటున్న ప్యాక్టరీ యజామాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ధరస్థిరీకరణ చేసి రైతులకు ప్రత్యకనిధి ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇస్తామని చెప్పి నేడు రైతులకు గిట్టుబాటు ధర పక్కన పెడితే కనీసం చెరకు కటింగ్ చేసుకొనే పరిస్థితులు లేవని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, సత్యవేడు ఇంచార్జ్ హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత, జెడి రాజశేఖర్, పద్మనాభ రాజు, ఇలగోవన్ రెడ్డి, తిరుమలరెడ్డి, సతీష్ నాయుడు, పాల్గొన్నారు.



బకాయిలను ఇప్పించాలని లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతన్నలు

20వ రోజు పాదయాత్ర షెడ్యూల్ వివరాలు

బుధవారం సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం ఉదయం 8.15 గంటలకు కీలపూడి (పిచ్చాటూరు మండలం) విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుది. 8.30 గంటలకు ఎస్సి సామాజికవర్గంతో ముఖాముఖి సమావేశం. 11 గంటలకు పిచ్చాటూరులో స్థానిక నాయకులతో మాటామంతీ. అరణియార్ ప్రాజెక్టు అభివద్ధిపై చర్చ, 12.50 గంటలకు వెంకటరెడ్డి కండ్రిగలో మధ్యాహ్నం భోజనం విరామం 1.40 గంటలకు వెంకటరెడ్డి కండ్రిగలో మహిళలతో మాటామంతీ. 3.40గంటలకు కెవిబి.పురం మండలం మిద్దికండ్రిగలోకి పాదయాత్ర ప్రవేశం. స్థానిక లీడర్లు స్వాగతం ఏర్పాట్లు 4.30గంటలకు ముత్తరాశి కమ్యూనిటితో సమావేశం. 5.20గంటలకు బంగారంమ్మ ఆలయం వద్ద ప్రత్యక పూజలు. 5గంటలకు కీలపూడి (పిచ్చాటూరు మండలం)లో బహిరంగసభలో ప్రసంగం. 6.50గంటలకు సదాశివపురంలో వగత్తూరు పంచాయతీ ప్రజలతో మాటామంతి. 7.50గంటలకు రాయిపేడు విడిది కేంద్రంలో రాత్రి బస.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ

చిన్నపొరపాటుకూ తావులేదు : జెసి



ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న జెసి డీకే బాలాజీ

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: శాసనమండలి ఎన్నికలలో నిర్వహణలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది చిన్నపొరపాటుకు కూడా తావివ్వరాదని కేటాయించిన విధులను ఎప్పటికప్పుడు అవగాహనతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు కేటాయించిన ప్రత్యేకఅధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశమై ఎన్నికల నిర్వహణపై పలు సూచనల చేశారు. జెసి మాట్లాడుతూ ప్రధానంగా పోలింగ్ మెటీరియల్ సిద్ధం చేయడం వాటిని సక్రమంగా పోలింగ్ కేంద్రాలకు అందించడం ప్రణాళిక ప్రకారం జరగాలని అన్నారు. పిఓలకు, ఎపిఓలకు ఆర్‌డిఓల సమక్షంలో ఎన్నికల నిర్వహణపై శిక్షణను ఇవ్వనున్నామని అన్నారు. ఈ శిక్షణను రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ విఆర్.చంద్రమౌళి నిర్వహించనున్నారని సూచించారు. ఈ ఎన్నికలు బ్యాలట్ పేపర్లతో జరగనున్నాయని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై అధికారులు పోలీస్ యంత్రాంగం రోజు వారి నివేదికలను అందించాల్సి ఉంటుందని అన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి కులశేఖర్, డిఆర్‌ఓ శ్రీనివాసరావు, రిటైర్డ్ జెసి ఆర్.చంద్రమౌళి, నగరపాలక డిప్యూటీ కమీషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, తుడా సెక్రటరీ లక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, ఎఓ సుబ్రహ్మణ్యం, ఎన్నికల తహశీల్దార్ పరమేశ్వర స్వామి, డిటి విజయభాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి కె.సంతోష రావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: విద్యుత్ ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు పేర్కొన్నారు. తిరుపతిలో ఈనెల 14 నుంచి 16వతేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ ఇంటర్ సర్కిల్ ఉమెన్ గేమ్స్ అండ్ కల్చరల్ కాంపిటీషన్స్ టోర్నమెంట్ 2022-23 ప్రారంభకార్యక్రమం సోమవారం ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఎండి కె.సంతోషరావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఒకవైపు ఇంటి బాధ్యతలు, మరోవైపు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు సమయాన్ని కేటాయించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఉద్యోగులు ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలతో సంస్థ అభివద్ధికి తమవంతు చేయూతనందించాలని కోరారు. ఈసందర్భంగా డైరెక్టర్ (ఫైనాన్స్) వివిఎన్.బాబు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుంటూ విధినిర్వహణలో ఉద్యోగులు అత్యుత్తమ సేవలందించాలని కోరారు. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంతో విధులు నిర్వహించడం ద్వారా సంస్థ అభివద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఉద్యోగులు మానసిక ప్రశాంతతతో విధులు నిర్వహిస్తూ సంస్థకు మెరుగైన సేవలందించాలని కోరారు. అనంతరం డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కె.శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడలతో పోటీతత్వం ద్వారా బలహీనతల్ని అధిగమించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. క్రీడల్లో రాణించేందుకు ప్రతిఒక్కరికీ క్రమశిక్షణ అవసరమన్నారు. క్రీడాకారులు ఉల్లాసంతో క్రీడల్లో పాల్గొంటూ, మనస్సు నిండా ఆనందాన్ని నింపుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్.వరకుమార్, డివి.చలపతి, కె.గురవయ్య, కెఆర్.ఎస్. ధర్మజ్ఞాని, కె.విజయ కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎ.రాధాజయశ్రీ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.లావణ్య లక్ష్మి, జనరల్ మేనేజర్లు విఆర్కే రాజు, ఆదిశేషయ్య, జానకిరామ్, రమణాదేవి, సత్యనారాయణ, పద్మ, శారద, శోభా వాలెంటీనా, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎం.కష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కె.వాసుదేవరెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమారవడివేలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వాసురెడ్డి, విజయన్, సురేష్, సుబ్బారావు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి పురుషోత్తం, సాంస్కతిక కార్యదర్శి ఎం.జయచంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సిఎండి సంతోషరావుకు సిఐటియు వినతి



తిరుపతి జిల్లాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి టి.కుమార్ సిఎండి కె.సంతోష్‌రావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు జి.గుణశేఖర్, ఎస్.హరి, కె.రూబెన్, ఆర్.మురళి కలిసి సమస్యలపై చర్చించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ, కడప జిల్లాలోనూ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించండి: సిఐటియు



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గ్రామరెవెన్యూ సహాయకులను బయోమెట్రిక్ నుంచి మినహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. సిఐటియు జిల్లాఅధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బయోమెట్రిక్ నుండి మినహాయింపు, కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, రికవరీ చేసిన డిఎ తిరిగి చెల్లించాలని, ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. వీఆర్ఏ సంఘం గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కార్మికులను వేధించే పద్ధతి ప్రభుత్వం మానుకోవాలని చెప్పారు. శ్రామిక మహిళ నాయకురాలు ఆర్.లక్ష్మి మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాకుంటే రాబోయే రోజులలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం ప్రధానకార్యదర్శి కె.సుబ్బయ్య మాట్లాడుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలో ధర్నాలు జరుగుతున్నాయని, రాబోయే రోజులలో సిఐటియు అండతో తీవ్రమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.గురవయ్య, గీత, విజయ్‌కుమార్, కస్తూరయ్య, కె.అంకయ్య, శ్రీనివాసులు, సీనయ్య, ఎస్.రామయ్య, చంద్రశేఖర్, మురళి, మణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శాసనమండలి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. మంగళవారం మధ్యాహ్నం అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాసనమండలి ఎన్నికలు జరగనున్న జిల్లాల రిటర్నింగ్ అధికారులతో, జాయింట్ కలెక్టర్లతో, డిఆర్‌ఓలతో, ఎన్నికల నిర్వహణపై సమీక్షించగా జిల్లా కలెక్టరేట్ నుండి జెసి డీకే బాలాజీ, డిఆర్‌ఓ శ్రీనివాసరావు, హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈనెల 9న రాష్ట్రంలో శాసనమండలి ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. ఆమేరకు అధికారులు ఎన్నికల నిర్వహణకు సిద్ధమవ్వాలని సూచించారు. నోటిఫికేషన్ ఈనెల 16 నుండి విడుదల కానున్నదని నామినేషన్లు దాఖలు సమయం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని అన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి డిపాజిట్ రూ.10వేలు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5 వేలు అని సూచించారు. మార్చి 13న పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు ఉంటుందని పోలింగ్ కేంద్రాలకు అనుబంధంగా ఆక్జలరీ పోలింగ్ కేంద్రాల గుర్తింపు అనుమతి కోసం నివేదిక వెంటనే పంపాలన్నారు. మార్చి 16న జరిగే కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, పోలింగ్ శిక్షణ పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రతిరోజు ఎన్నికల కమిషన్ సూచించే ఆదేశాలను అనుసరించాలని సూచించారు. రిటైర్డ్ జెసి విఆర్. చంద్రమౌళి, స్పెషల్ ప్రోటోకాల్ డిప్యూటి కలెక్టర్ టి.భాస్కర నాయుడు, డిఎల్‌డిఓ సుశీలదేవి, తహసిల్దార్లు కుప్పయ్య, పరమేశ్వర స్వామి, డిటి విజయభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

ఎల్టీఈ ప్రభాకరన్ పై

తమిళ ప్రభుత్వం తన వైఖరిని తెలపాలి

ప్రజాశక్తి- తిరుమల : ఎల్టీటీ ప్రభాకరన్‌పై తమిళనాడు ప్రభుత్వం స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని ఆల్ ఇండియా యాంటీ టెర్రరిజం ఫ్రంట్ చైర్మన్ మణిందర్ సింగ్ జీత్ బిట్టా డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభాకరన్ గురించి వార్త మొదటిసారి వింటున్నాననీ, ఢిల్లీ వరకూ ఈ వార్త ఇంకా చేరలేదని అన్నారు. ముందు తమిళనాడు ప్రభుత్వం స్టాండ్ దీనిపైన ఏంటో క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. వాళ్లు ప్రభాకరన్ వారసులుగా ఉండాలి అనుకుంటున్నారా లేదా తీవ్రవాదిని తీవ్రవాదిగానే చూడాలనుకుంటున్నారో చెప్పాలన్నారు. తాను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్తానని చెప్పారు. ఈలోగా దీనిపైన తమిళనాడు ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఏపీలో జగన్‌ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తోందనీ, విశాఖను రాజధానిగా నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. ఏపీ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభం

6 నెలల్లో ఎస్వీ హైస్కూల్ మైదానం పూర్తిస్థాయిలో అభివృద్ధి : జేఈవో



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జేఈవో సదా భార్గవి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీల్లో భాగంగా మంగళవారం తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ మైదానంలో జేఈవో సదా భార్గవి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అదేవిధంగా ఇక్కడి రిక్రియేషన్ హాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ టేబుల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ ఉద్యోగులు కోరిన వెంటనే మైదానం అభివృద్ధి కోసం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి రూ.84 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ క్రికెట్, వాలీబాల్, షటిల్ కోర్టులతోపాటు రిక్రియేషన్ హాల్లో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ క్రీడలు ఆడేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 6నెలల్లో ఇతర క్రీడా పరికరాలను సమకూర్చి, గోడలకు క్రీడాంశాలతో కూడిన చక్కటి పెయింటింగ్‌తో మైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఫిబ్రవరి 2న ప్రారంభమైన క్రీడాపోటీలు 20వ తేదీ వరకు జరుగుతాయని, విజేతలుగా నిలిచిన వారికి ముగింపు సమావేశంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత, ఈఈ మురళి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి



యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ నేర్పించాలని ఆదేశిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలోని యువతకు వివిధ రంగాలలో శిక్షణఇచ్చి వత్తి నైపుణ్యం కల్పించి పరిశ్రమలలో ఉద్యోగావకాశాలను కల్పించడానికి, స్వయం ఉపాధి కల్పించే దిశగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్‌హాబ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్కిల్ డెవలప్మెంట్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ కమిటీ ముఖ్యఉద్దేశ్యం జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా, పరిశ్రమల్లో నిపుణుల కొరతను గుర్తించి, ఆ మేరకు యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన చేపట్టాలని అన్నారు. స్కిల్ హబ్స్‌లో యువతకు శిక్షణ కొరకు కమిటీ తగిన ప్రణాళికలను రూపొందించాలని, శిక్షణలో ఇస్తున్న కోర్సులు, వాటి వ్యవధి, యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటయిన స్కిల్‌హబ్‌లలో జరుగుతున్న శిక్షణలపై సంబంధిత ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్స్ ద్వారా చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఎస్వియు, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ అఫ్ కన్స్ట్రక్షన్ వారి సహకారంతో శిక్షణ పూర్తి అయిన విద్యార్థులకు, యువతకు ఉద్యోగాలు కల్పించాలని తెలిపారు. ఇకపై జిల్లాలో ప్రతి నెల రెండవ శుక్రవారం, నాలుగవ మంగళవారం జాబ్‌మేళాలు నిర్వహించాలని, జిల్లాలోని నిరుద్యోగ యువతను సచివాలయాల్లో స్కిల్ హబ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ కోసం అవగాహన కల్పించాలని సూచించారు. ఈ స్కిల్‌హబ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జిల్లాలోని పరిశ్రమలతో ఉద్యోగ అవకాశం కల్పించేలా ఏపిఐఐసి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులకు చూడాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో కనీస లక్ష్యం 30మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు చేపట్టాలని, వీటిని డిఎల్‌డిఓ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లాలోని యువతకు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలు కల్పించే దిశగా జాబ్‌మేళా క్యాలెండర్‌ను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలన్నారు. సమీక్షలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్యామోహన్, డిఆర్‌డిఎ, మెప్మా పిడిలు జ్యోతి, రాధమ్మ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుహాన సోని, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, సీఈఓ సెట్విన్ మురళి కృష్ణ, వివిధ ఐటిఐ ప్రిన్సిపల్స్, పాలిటెక్నిక్ కాలెజి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కంటి ధ్వజారోహణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి ధ్వజారోహణం వైభవంగా జరిగింది. సోమవారం కన్నప్ప ధ్వజారోహణాన్ని ప్రారంభించిన విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం ఆలయంలోని స్వామివారి సన్నిధికి ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్ద పూజారులు, వేదపండితులు హోమ పూజలు చేశారు. ధ్వజస్తంభానికి నాలుగు వైపులా దర్భ, పవిత్రమైన దుస్తులతోపాటు భక్తులు అందించిన చీరలను ధ్వజస్తంభానికి అలంకరించారు. దీంతో స్వామివారి ద్వాజారోహణం పూర్తయింది. ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి, ఆర్డీవో రామారావు పాల్గొన్నారు.

మీడియా పాయింట్ ప్రారంభం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై మీడియా పాయింట్ ప్రారంభించారు. 13 రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాల కవరేజీకి ఈ మీడియా పాయింట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కంప్యూటర్లతో పాటు, ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంచామని, పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, పలువురు పాత్రికేయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేద్దాం..!


శ్రీకాళహస్తిలో ...


బుచ్చినాయుడుకండ్రిగలో..


యర్రావారిపాలెంలో ...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేత, మాజీ శాసనమండలి సభ్యులు బీదా రవిచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన బీద రవిచంద్రయాదవ్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఐదు రోజుల పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర జరుగనుందని తెలిపారు. ఏపీలో పరిస్థితులు మారాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీకి పాదయాత్రలు కొత్తవి కాదన్నారు. నారా చంద్రబాబునాయుడు ప్రజల కోసం 'మీ కోసం' పాదయాత్ర చేశారన్నారు. అంతకుముందు నందమూరి తారక రామారావు చైతన్య రథయాత్ర చేశారన్నారు. నేటి తరం కోసం నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈ యాత్రను భగ్నం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఎన్నో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యు సత్రవాడ మునిరామయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నేత అన్నారు. ఆయనకు, తనకు మధ్య మంచి సంబధం ఉందన్నారు. శ్రీకాళహస్తి లో అత్యంత పవిత్రమైనదని అన్నారు. ముక్కంటి క్షేత్రంలో అహం పనికిరాదన్నారు. తండ్రి పాత్ర పోషిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కషి చేస్తానన్నారు. ఎమ్మెల్య సత్యప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: టీడీపీ యువనాయకులు నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో పాల్గొని మహాసభను విజయవంతం చేద్దామని టీడీపీ మండలాధ్యక్షులు సుధాకర్నాయుడు కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రను విజయవంతం చేసి నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలియజేశారు.

యర్రావారిపాలెం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్ఛార్జి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పిలుపునిచ్చారు. నెరబైలు పంచాయతీలో మంగళవారం ఆమె పర్యటిస్తూ పార్టీ అభివృద్ధికి ప్రతిఒక్క టీడీపీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి యువగళం పాదయాత్రను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకెళ్లాలన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలోని పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి కార్యకర్తలకు సూచించారు. టిడిపి మండల అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు,జిల్లా కార్యదర్శి అన్న సముద్రం మధు, రాజన్న,గోపాల్, చంద్రశేఖర్ నాయుడు, వెంకట శివరాం రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, రమణారెడ్డి, అశోక్ రెడ్డి, హరిచంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

10వ మహాసభలు జయప్రదం చేయండి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని నీర్పాకోట, పుచ్చలపల్లి, సుందరయ్య గిరిజన కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రమణయ్య ఆధ్వర్యంలో మంగళవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15, 16 ,17వ తేదీలలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులను కోరారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం మండల అధ్యక్షులు సమ్మెటి తిరుపాలు, మండల కార్యదర్శి సుబ్బయ్య, నాయకులు బాల గురవయ్య, సిసింద్రీ, నరేష్, సురేష్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్కండ్రిగ తహసీల్దారు సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఆర్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం కార్యాలయం ఎదుట బాల్యవివాహాల నిర్మూలన కోసం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎక్కువశాతం గిరిజన ప్రాంతాలలో బాల్యవివాహాలు జరుగుతూ ఉంటాయని..బాల్యవివాహాలతో కలిగే సమస్యలను వివరిస్తూ పోస్టర్లను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యానాది సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య, సూరమ్మ, సూరమ్మ, ఏఎస్వో ప్రసూన, వెలుగు ఏపీఎం ఇందిరా, సీసీలు, యానాది ఎంఎస్ లీడర్లు, వీవో లీడర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బనిగిసాహెబ్పేటలో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు



ప్రజాశక్తి-గూడూరు: రాబోయే వేసవిని దష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా గూడూరు టౌన్ 2 సెక్షన్ పరిధిలోని బనిగిసాహెబ్పేట రామాలయం వీధిలో విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశారు. డీఈ ఈ ప్రసాద్, ఏఈ ఏడుకొండలు, సిబ్బంది నరసయ్య, శ్రీధర్రాజు, వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

సారా అమ్మకాలు ఆపితే రుణాలు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలో నాటుసారా, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అమ్మడం, తయారు చేయడం చేయకుండా పరివర్తనం చెందితే ప్రభుత్వం తరపున రుణం అందించి వారి జీవనోపాధికి ఉపయోగపడేలా రుణాలు అందించి ఆదుకుంటామని చంద్రగిరి ఎస్ఈబీ సీఐ లీలారాణి మంగళవారం తెలిపారు. మండలంలో ఎవరైనా సారా, గంజాయి, మత్తు పానీయాలు అమ్మితే చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను స్థానిక గిరిజన భవన్లో బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు బంజారా నాయకులు గుండాల నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి గిరిజన నాయకులు, లంబాడి, సుగాలి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

అభివృద్ధి పేరుతో కక్ష సాధింపు తగదు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో అభివృద్ధి పేరుతో ప్రతిపక్ష పార్టీపై కక్ష సాధింపు చేస్తున్నారని, తిరుపతి నగరాభివృద్ధికి ఎమ్మెల్యే భూమన, నగరపాలక సంస్థ కృషి చేయాలని టిడిపి తిరుపతి పట్టణ అధ్యక్షులు శంకరనారాయణ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్న ఏకైక పార్టీ టీడీపీనేనని అన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన వైసీపీ కేవలం కక్ష సాధింపు చేస్తున్నారే తప్ప అభివృద్ధి చేయడం లేదని.. ఇందుకు నిదర్శనం గత నాలుగు నెలలుగా తిరుపతి నడిబొడ్డులో ఉన్న పెద్దకాపు లేఅవుట్ లో అభివృద్ధి పేరుతో గుంతలు తవ్వి వదిలేసిన సంఘటనేనన్నారు. నాడు కరోనా సమయంలో ఇక్కడి లాడ్జీల నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారని.. నేడు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతపు ప్రజలు అధికార పార్టీకి ఓట్లు వేయలేదన్న నెపంతో కక్ష సాధింపు చర్యగా వ్యవహరిస్తున్నారని, తిరుపతి గంగమ్మ ఆలయం అభివృద్ధి చేయడం అనే ముసుగులో ఆలయానికి మాస్టర్ ప్లాన్ రోడ్డును అనుసంధానిస్తున్నారన్నారు. నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా అడ్డుకోలు సృష్టిస్తున్నారని, జగన్మోహన్ రెడ్డి ఆనాడు చేసిన పాదయాత్రకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, ప్రకాష్, మునాఫ్, చిన్నారాయల్, మధుసూధన్, నరసింహులు, యాదవ్, సుబ్బరాయుల నాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

'పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్కు లేదు'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఒంటరిగా జగన్ అధికారంలోకి వచ్చారని.. నారా లోకేష్లా తండ్రిని అడ్డుపెట్టుకొని మంత్రి పదవులు చేపట్టలేదని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మురళీధర్రెడ్డి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు రూ.200 నుంచి రూ.300 చెల్లించి జనాన్ని రప్పిస్తున్నారని, జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు జనం స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలిపారని గుర్తు చేశారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, వైసీపీ ఎమ్మెల్యేలను విమర్శించే స్థాయి నారా లోకేష్ కు లేదన్నారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్రలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని అనడం అర్థ రహితమన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు విభాగం నాయకులు లక్ష్మీపతి రాజు, బీసీ సెల్ నాయకులు ఏలుమలై అలియాస్ అమ్ములు, నింద్ర మండలం జడ్పీటీసీ పరంధామ యాదవ్, పుత్తూరు మాజీ జడ్పీటీసీ ప్రతాప్, ఎంపీటీసీ భాస్కర్రెడ్డి, తులసిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్తో ఆరోగ్యం పదిలం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: సైకిల్ తొక్కడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశికళ సూచించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సైకిల్ తొక్కడంతో ఆరోగ్యకరమైన జీవన విధానం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఆయన కోరారు. రక్తపోటు నియంత్రణలో ఉండటానికి ఉపయోగపడుతుందని, ఉత్సాహంగా.. ఉత్తేజంగా ఉండటానికి దోహదపడుతుందని, మంచిగా నిద్రపోవడానికి ఉపకరిస్తుందన్నారు. అనంతరం స్కూల్ పిల్లలచే సైకిల్ తొక్కించారు. డాక్టర్ తేజస్విని, సీహెచ్వో శేషకుమారి, సూపర్వైజర్ సుబ్రమణ్యం, ఆయుష్ ఫార్మసిస్ట్ షఫీ, ఆశా వర్కర్లు హంస, చిట్టమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: నీర్పాకోట గ్రామ సచివాలయ పరిధిలో సైక్లింగ్ చేయడంతో కలిగే ప్రయోజనాలపై డాక్టర్ మాధవి, డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలియజేస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమంతప్పకుండా వ్యాయామం చేయడంతో శారీరక బరువును క్రమంగా తగ్గించుకోవచ్చన్నారు. రోజువారీ ఒత్తిడి నుంచి బయట పడటానికి శారీరక వ్యాయామం ఎంతో తోడ్పడుతుందన్నారు. రక్తపోటు నియంత్రణలో ఉండటానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. నిద్రపోవు సమయంలో వ్యాయామ చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం, సచివాలయం వీఆర్వో జగదీష్, సచివాలయం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అనారోగ్యంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోట: శ్యామసుందరపురం గ్రామానికి చెందిన వెలుగు ముత్యాలయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోట క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఉదయం 11 గంటల సమయంలో స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శ్మశాన వాటికకు తరలించారు.




రైలు ఢీకొని యువకుడి..

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఎస్ఆర్ కాలనీ రైల్వే ట్రాక్పై రైలు ఢీకొనడంతో ఓ యువకుడు మంగళవారం ఉదయం అక్కడికక్కడే మృతి చెందాడు. నాయుడుపేట పట్టణం ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన ఆత్మకూరు చందు(అలియాస్ నల్లబాలు)అనే యువకుడు ఉదయం 7 గంటల సమయంలో రైల్వే ట్రాక్పై వెళ్తుండగా నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షేత్రస్థాయిలో క్షత్రియుల అభివృద్ధికి కృషి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న క్షత్రియల సమగ్ర పురోగతికి, వారి అభివద్ధికి, వివిధ రంగాల్లో సేవలు అందించేందుకు ఎస్ఆర్ఎస్ఆర్ సోషల్ టెక్ ఫౌండేషన్ ఉందని రాష్ట్రీయ క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు డా. బలరామరాజు, టీటీడీ క్షత్రియ సంఘం నాయకులు రుక్మాంగదరాజు, గురుప్రసాద్ రాజు, భాస్కర్ రాజు, నవీన్ రాజు, విజయరామరాజు పేర్కొన్నారు. ఎస్సార్ ఎస్సార్ ఎస్టియఫ్ ప్రతినిధులు మంగళవారం బలరామరాజును కలిసి తాము చేపడుతున్న క్షత్రియ జనగణనను గురించి వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ క్షత్రియులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు, ఆరోగ్య రక్షణ కల్పించి, ఆర్థికంగా.. రాజకీయంగా.. సామాజికంగా ఆదుకునేందుకు పూర్తి వివరాలను సేకరించి భవిష్యత్తు తరాలకు సహాయ చేస్తున్న ఎస్సార్ ఎస్సార్ సిబ్బందిని అభినందించారు. టీటీడీ క్షత్రియ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్సార్ ఎస్సార్ ప్రతినిధులకు సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. వారి సేవలను కొనియాడారు. ఎస్సార్ వారికి శ్రీవారి ప్రసాదాలను, ప్రశంసా పత్రాలను అందించి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో తిరుపతి సీనియర్ జర్నలిస్ట్, క్షత్రియ నాయకుడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు, రాజంపేట క్షత్రియ నాయకులు విజయరామరాజు, నరేష్ రాజు, చిరంజీవిరాజు, మురళిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనాసుర రక్త చరిత్ర పోస్టర్లు విడుదల



ప్రజాశక్తి -గూడూరు: గూడూరు టీడీపీ కార్యాలయంలో గూడూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప మాజీ ఎంపీ స్వర్గీయ వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై జగనాసుర రక్త చరిత్ర పోస్టర్లు, బుక్లెట్ ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీకి చెందిన కడప ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య అప్పట్లో రాష్ట్రంలో పెను సంచలనం రేపిందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి ఈ హత్య ఉదంతాన్ని చంద్రబాబునాయుడుపై మోపి, కేంద్రాన్ని సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారని.. తరువాత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దర్యాప్తు అవసరం లేదని కేంద్రానికి లేఖ రాసి ఈ హత్య దర్యాప్తును నత్తనడకన సాగించి దానిని పట్టించుకోవడం మానేసిందన్నారు. ఈ హత్య ఉదంతాన్ని, విచారణలోని సంగతులను వెలికి తీసి ప్రజలకు బహిర్గతం చేసేందుకే టీడీపీ అధిష్టానం జగనాసుర రక్త చరిత్ర అంటూ పోస్టర్లు, బుక్లెట్ విడుదల చేస్తోందన్నారు. గూడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు గూడూరు పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వరరాజు, తిరుపతి పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ , తిరుపతి పార్లమెంటు కార్యదర్శి యనమల దినేష్, గూడూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ నాయకుడు శ్రీనివాసులు, గూడూరు పట్టణ వైస్ ప్రెసిడెంట్ నర్సింహులునాయుడు, గూడూరు మండల పార్టీ ప్రధాని కార్యదర్శి ముమ్మడి అమరేంద్ర, మాజీ కౌన్సిలర్లు కస్తూరి గురవయ్య, మోహన్, వీరుబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ , టిడిపి సీనియర్ నాయకుడు గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణలో భాగస్వాములవుదాం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: రోజురోజుకు క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ వ్యాధి నివారణలో, ప్రారంభదశలోనే గుర్తింపు, వైద్యచికిత్స అందించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 14ను ఆయుష్మాన్ భారత్ సంయుక్తంగా హెల్త్మేళా సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక బైరాగిపట్టెడ అర్బన్ హెల్త్సెంటర్ నుండి సైకిల్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ నమోదు 10 శాతంగా ఉందని సైక్లింగ్ చేయడం వల్ల క్యాన్సర్ సంబంధిత మరణాలను 45శాతం నిరోధానికి సహాయపడుతుందని సర్వేలు సూచిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం క్యాన్సర్ నివారణ, ప్రథమ స్థాయిలోనే గుర్తించడం, సైక్లింగ్ నిర్వహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు. మన జిల్లాకు ప్రత్యేకత ఉందని క్యాన్సర్ ఆసుపత్రులు స్విమ్స్, టాటా వంటివి ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయని క్యాన్సర్ గుర్తింపుకు, చికిత్సకు ప్రాధాన్యత ఇవ్వడానికి త్వరలో క్యాన్సర్స్ర్కీనింగ్ పరీక్షలను చేపట్టనున్నామన్నారు. ఇందులో అత్యధిక ప్రాముఖ్యత 45 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి ఇవ్వనున్నామని, ఇప్పటికే జిల్లాలో రెండు పింక్ బస్సులు ఉన్నాయని మరో రెండు అవసరమని ప్రభుత్వానికి నివేదించామని త్వరలో వైద్యసిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు ముఖ్యంగా శారీరక శ్రమకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆరోగ్యవంతంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాసరావు, డిఐఓ శాంతకుమారి, డిఎస్ఓ హర్షవర్ధన్, వైద్యాధికారులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో సైబర్ క్రైమ్పై అవగాహన



ప్రజాశక్తి-వరదయ్యపాళెం: సైబర్ నేరాల నియంత్రణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసిటీలో సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు జరిగింది. హైదరాబాద్లోని సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ నరసింహరావు 'సైబర్ క్రైమ్ అండ్ సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై వివరించారు. కార్యక్రమానికి విచ్చేసిన తిరుపతి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (క్రైమ్) బిహెచ్ విమల కుమారి, సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ నరసింహరావు, ఇతర సీనియర్ పోలీసు అధికారులకు స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అవగాహన సదస్సు నిర్వహణకు శ్రీసిటీని ఎంపిక చేసినందుకు కతజ్ఞతలు తెలిపారు. పారిశ్రామిక వర్గాల జ్ఞానాన్ని పెంచే ట్రెండింగ్ టెక్నాలజీ వర్క్షాప్ను శ్రీసిటీలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ పటిష్టంగా లేకుంటే జరిగే నష్టాలను అర్థం చేసుకోవడంతో పాటు రక్షణ వ్యవస్థ కోసం చేపట్టాల్సిన నియంత్రణ చర్యల గురించి వివరంగా తెలుసుకోవాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు. ఏఎస్పీ విమల కుమారి మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు తిరుపతి పోలీసు సూపరింటెండెంట్ పి.పరమేశ్వర రెడ్డి సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలకు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాలో విద్యార్థులు, మహిళలు, ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని అత్యాధునిక సైబర్ ల్యాబ్ ద్వారా పోలీసు శాఖ అనేక సైబర్ నేరాలను ఛేదించడంతో పాటు సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలోనూ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సదస్సులో సైబర్ క్రైమ్ సీఐ రామచంద్రారెడ్డి, శ్రీసిటీలోని పరిశ్రమలకు చెందిన 120 మంది హెచ్ఆర్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్లు హాజరయ్యారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అన్నమయ్య జిల్లా పరిధిలోని బాలపల్లి రేంజ్ లో టాస్క్ ఫోర్స్ అధికారులు 16 ఎర్రచందనం దుంగలతో పాటు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్ఐ కృపానంద బందం అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలో బాలపల్లి రేంజ్ తుని కొండ ఫారెస్ట్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది ఇన్నోవా కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తున్నారని, వారిని చుట్టుముట్టి దుంగలతో పాటుగా ఇన్నోవా కారు, హీరో మోటార్ సైకిల్, రూ.80 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. పట్టుబడ్డ వారు రైల్వే కోడూరు మండలానికి చెందిన నాగోల వెంకటరెడ్డి, బొడ్డు శ్రీనివాసులరెడ్డి, మిరియాల నాగేంద్రబాబు, ఓబులవారిపల్లె మండలం అరికల మహేంద్రలుగా గుర్తించామన్నారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

యర్రావారిపాలెం: ఫారెస్ట్ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని ఎల్లమంద, బోడేవాళ్ళపల్లి పరిసర రోడ్డు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించగా సోమవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో తలకోన నార్త్ బీట్ పరిధిలోని బోడేవాళ్ళపల్లి రోడ్డు ప్రాంతంలో అటుగా వస్తున్న బైకు, కారు ఆపకుండా పారిపోతుండగా భాకరాపేట అటవీ శాఖ సిబ్బంది వాహనాలను వెంబడించారు. ద్విచక్రవాహనం, షిఫ్ట్ డిజైర్ కారును వదిలేసి పారిపోయారు. ఇందులో 8 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారి దత్తాత్రేయ స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎఫ్ఎస్వో ప్రదీప్ కుమార్, ఎఫ్బీవోలు రాజేష్, సదాశివయ్య, నిఖిల్ ప్రదీప్చంద్, లోకనాథ్, బేస్ క్యాంప్ సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రేణిగుంట: కరకంబాడి-తిరుపతి రోడ్డు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళం సమీపంలోని బీటీఆర్ కాలనీకి చెందిన వెంకటస్వామి (75) ఆదివారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనంలో మరో వ్యక్తితో వెళ్తూ కారును ఢీకొని గాయడ్డారు. వెంకటస్వామిని తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవారి సేవలో తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంగళవారం తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు సూపరింటెండెంట్ శేషగిరి, వీఐ రామ్మోహన్, ప్రసాద్, అశోక్, అర్చకులు బాబు స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.